
సాక్షి ఒడిశా

శుక్రవారం । 2 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,46,722, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 238.5 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు

- 8లో



పేదలందరికీ ఇళ్లందించేందుకు కృషి చేయాలి

- 8లో

న్యూస్‌రీల్

తాగునీటికి కటకట



రోడ్డుపై ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి సిద్ధమణుగు గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. వేసవికి తోడు తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో మహిళలు గురువారం ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. పర్లాకిమిడి నుంచి గుణుపురం, రాయగడ, కొరాపుట్ మార్గంలో వాహనాలను అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్ నిలిచి, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆందోళనపై సమాచారం అందుకున్న కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్లశాయమ్మ, సర్పంచ్ అక్కడికి చేరుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న బైక్

- ఇద్దరు యువకులు మృతి



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు



త్రిపతి, లయిచన్(ఫైల్)

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి శొశాహండి గ్రామం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. శొశాహండి గ్రామం సమీపంలో కలపలోడుతో నిలిపి ఉన్న ట్రక్కును బొరిగుమ్మ నుంచి కొట్‌పాడ్ వైపు వేగంగా వెళ్తున్న బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న కొట్‌పాడ్ సమితి గువాలి గ్రామానికి చెందిన త్రిపతి పూజారి(26), లయిచన్ భోత్ర(25) ప్రాణాలు కోల్పోయారు. బొరిగుమ్మలో జరిగే వివాహానికి ఇరువురు యువకులు బైక్‌పై వెళ్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కొట్‌పాడ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు నియంత్రణలో చర్యలు భేష్



ఆరోగ్యశాఖ కార్యదర్శి మహంతి నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న డాక్టర్ రౌత్రాయ్

రాయగడ: పొగాకు నివారణ చర్యల్లో భాగంగా రాయగడ జిల్లా ఆరోగ్యశాఖ చేపడుతున్న చైతన్య, అవగాహన శిబిరాలు యువతకు మేల్కొలుపునిస్తున్నాయని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజిత్‌కుమార్ మహంతి అభినందించారు. శుక్రవారం జరిగిన ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్‌ను అభినందించి, ప్రశంసాపత్రం అందించారు. మరోవైపు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమావేశ మందిరంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీఎల్ఎస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏడీఎం డాక్టర్ బీఎల్ఎస్ పృష్టి, డాక్టర్ మమత చౌదరి, రాజేష్ పట్నాయక్ తదితరులు పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రసంగించారు. పొగాకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. వారిలో అవగాహన కలిగించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు.

నిలిచిన సేవలు

- ఆందోళనకు దిగిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు
- రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవులతో నిరసన
- గ్రేడ్‌పే రూ.4,200 లకు పెంచాలని డిమాండ్
- ఉద్యోగులు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిచ్చిన కార్యాలయాలు



పర్లాకిమిడి: కలెక్టరేట్ మెట్లపై ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

భువనేశ్వర్: వేతనాల పెంపు నినాదంతో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఈ నిరసన నిరవధికంగా కొనసాగుతుందని హెచ్చరించారు. గతంలో అంచెలంచెలుగా ప్రభుత్వంతో చేసిన సంప్రదింపులకు స్పందన కొరవడడంతో సామూహిక సెలవుతో గురువారం నుంచి నిరవధిక ఆందోళన చేపట్టేందుకు నడుం బిగించారు. తమ డిమాండ్ పట్ల ప్రభుత్వం దిగి రాకుంటే కార్యకలాపాల్లో సహకరించేది లేదని స్పష్టం చేశారు. దీంతో రాష్ట్రంలో పలుచోట్ల ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉద్యోగుల గ్రేడ్ పే రూ.1,900ల నుంచి రూ.4,200 లకు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట సిబ్బంది నిరసన ప్రదర్శనకు దిగారు. ఒడిశా మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్(ఓఎంఓఏ) ఒడిశా రివైజ్డ్ స్కేల్స్ ఆఫ్ పే(ఓఆర్ఎస్‌పీ) రూల్స్–2017 ప్రకారం లెవల్ 9ను అనుసరించి, గ్రేడ్‌పే రూ.4,200 లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒడిశా మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఉద్యోగులు సామూహిక సెలవుపై వెళ్లడంతో పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు దాదాపు మూతపడ్డాయి. అనేక ప్రాంతాల్లో కార్యాలయాల పనితీరును ప్రభావితమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిమాండ్ సాధన పట్ల అధికార వర్గాలతో చేపట్టిన సంప్రదింపులు ప్రయోజనం కొరవడింది. దీనికి నిరసనగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాలుపంచుకుని శాంతియుతంగా ఆందోళన చేపట్టారు. ఈ నిరసన పట్ల ప్రభుత్వం పెడచెవి వైఖరి ప్రదర్శించి, ఆందోళనకు ఆజ్యం పోసిందని ఆందోళనకారుల వర్గం ఆరోపించింది. గ్రేడ్‌పే పెంచాలని కోరుతూ ఉద్యోగులు అన్ని జిల్లాల్లో గురువారం లాంఛనంగా నిరసన చేపట్టారు. ఇకపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. సామూహిక సెలవు ఆందోళన ఉధృతం కాకముందే ప్రభుత్వం మేలుకోవాలని అభ్యర్థించారు. డిమాండ్ నెరవేరేంత వరకు ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు ప్రభుత్వానికి సహకరించరని పేర్కొంటూ సామూహిక సెలవులు, శాంతియుత నిరసనలు కొనసాగిస్తారని ఆందోళనకారులు తెలిపారు. అంచెలంచెలుగా ప్రారంభమైన ఆందోళన.. రాష్ట్ర రాజధాని నగర వీధులకు విస్తరిస్తుందని హెచ్చరించారు.

గజపతి జిల్లాలో..

పర్లాకిమిడి: గజపతి జిల్లా మినిస్టీరియల్ సంఘం సామూహిక సెలవులకు దిగారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. తమ దీర్ఘకాలిక డిమాండ్ గ్రేడ్‌పే ప్రస్తుతం ఇస్తున్న రూ.1,900లు నుంచి రూ.4,200 లకు పెంచాలని డిమాండ్ చేస్తూ గత 10రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. దీనిపై ప్రభుత్వం మే 31లోగా నిర్ణయం వెల్లడించాలని అల్టిమేటం విధించగా, అదికాస్త ముగియడంతో సామూహిక సెలవులకు దిగారు. జిల్లాలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, వ్యవసాయశాఖ, మత్స్య, పశుసంవర్ధక, ట్రెజరీ, గ్రామీణ తాగునీరు, పారిశుధ్యం, రూరల్ రోడ్లు, డీఆర్‌డీఏ తదితర శాఖల ఉద్యోగులు సెలవులో వెళ్లిపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు నిలిచిపోయాయి.



భద్రక్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా సామూహిక ధర్నా నిర్వహిస్తున్న సిబ్బంది

విభేదాలకు తావులేదు

- రాష్ట్రమంత్రి అతున్ సవ్యసాచి నాయక్
- రాయగడలో బీజేడీ నాయకులతో భేటీ



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అతున్ సవ్యసాచి నాయక్

రాయగడ: జిల్లాలో బీజేడీలో వర్గ విబేధాలకు ఎటువంటి తావులేదని జిల్లా ప్రణాళిక మండలి చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి, జిల్లా పరిశీలకుడు అతున్ సవ్యసాచి స్పష్టం చేశారు. గత కొద్దికాలంగా జిల్లాలో బీజేడీ రెండు వర్గాలుగా చీలిపోయిందని, రానున్న ఎన్నికల్లో దీని ప్రభావం పడే అవకాశం ఉందన్న ఊహాగానాలపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. రాయగడలో గురువారం పర్యటించిన ఆయన.. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బిజూ జనతాదళ్‌లో సీఎం నవీన్ పట్నాయక్ ఒక్కరే నాయకుడని, మిగతా వారంతా సైనికులు మాత్రమేనని పేర్కొన్నారు. బీజేఈ కుటుంబం చాలా పెద్దదని, చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే ఉండవచ్చన్నారు. అంతమాత్రాన వీటిని వర్గ విబేధాలుగా చూడాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. జిల్లాలోని రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాల్లో ఈసారి పార్టీ విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. 2019లో రాయగడ అసెంబ్లీ స్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందడంపై ప్రశ్నించగా.. గత ఎన్నికల్లో ప్రజలు తమ అభిప్రాయాన్ని భిన్నంగా వ్యక్తం చేశారన్నారు. అయితే ఈసారి తమవైపే ఉంటారని విశ్వాసం వ్యక్తపరిచారు. ప్రజా సంక్షేమ పథకాలే బీజేడీని మరోసారి విజయ పథంలో నడిపిస్తాయన్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు సైతం ఇదే నిరూపితమైందని తెలిపారు.

స్వాగతం పలికిన నేతలు..

ఇదిలా ఉండగా మంత్రి సవ్యసాచి నాయక్‌ను సర్క్యూట్ హౌస్ వద్దకు కార్యకర్తలు కలిసేందుకు వచ్చినప్పటికీ పోలీసులు లోపలకు అనుమతించలేదు. దీంతో రాయగడ మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి.. వెంటనే వారిని లోపలకు అనుమతించాలని పోలీసులకు సూచించారు. అనంతరం దాదాపు గంట సమయం ఆయన కార్యకర్తలను కలిసి, ఈ ప్రాంత సమస్యలను విన్నారు. అంతకుముందు భువనేశ్వర్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకున్న ఆయనకు పార్టీ వర్గాలు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి, సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుదీర్ దాస్, మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి సవ్యసాచికి స్వాగతం పలుకుతున్న జగన్నాథ సరక, నాయకులు

గంజాయితో ముగ్గురి అరెస్ట్

- నిందితుల్లో ఇద్దరు ఢిల్లీకి చెందిన వారిగా గుర్తింపు



పట్టుబడిన గంజాయితో నిందితులు

జయపురం: పట్టణంలోని సదర్ పోలీసులు 71కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని సదర్ పోలీసు స్టేషన్ అధికారి ఈశ్వర తండి గురువారం తెలిపారు. జయపురం రైల్వేస్టేషన్ సమీపంలో బైక్‌పై గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. నిందితులు మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్ పరిధి జబగుడ గ్రామానికి చెందిన జయ పెన్‌లాల్ కుమారుడు గణేష్ పెన్‌లాల్(20), తూర్పు ఢిల్లీ రఘువీర నగర్ 514 ట్రాన్‌జిట్ క్యాంప్‌లో నివసిస్తున్న గోపాల కుమార్ షాహా(21), సుభాష్‌నగర్ వాసి అజయకుమార్(20)గా గుర్తించారు. పట్టుబడిన సరుకు విలువ రూ.7,10,000లు ఉంటుందని తెలిపారు. వీరంతా మల్కన్‌గిరి జిల్లా మారుమూల ప్రాంతమైన జొడొఅంబ గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి, అక్కడి నుంచి ఢిల్లీకి తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. గంజాయి రవాణా చేస్తున్న వాహణంతో పాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. దాడిలో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.పండా, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ వసూళ్లలో రికార్డు



భువనేశ్వర్: ఈ ఏడాది మేలో రాష్ట్రం ద్రవ్య సేవా పన్ను(జీఎస్టీ) వసూళ్లలో రికార్డు సాధించింది. రూ.4397.73 కోట్ల స్థూల జీఎస్టీ వసూలు నమోదైంది. గత సంవత్సరం ఇదే నెలలో పన్ను వసూలు రూ.3955.75 కోట్లకు పరిమితమైంది. ఈ లెక్కన ఈ ఏడాది 11.17% వృద్ధి రేటు సాధించింది. ఈ ఏడాది మే వరకు ప్రగతిశీల స్థూల జీఎస్టీ సేకరణ రూ.9433.47 కోట్లు. గత ఏడాది మే వరకు స్థూల ఆదాయం రూ.8865.98 కోట్లకు పరిమితం కావడంతో ప్రగతిశీల స్థూల ఆదాయం 6.40శాతం వృద్ధిరేటు నమోదైంది. ఈ నేపథ్యంలో జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం వాటా గణనీయంగా పుంజుకుంది. గత ఏడాది మేలో రాష్ట్రప్రభుత్వం వాటా రూ.1286.29 కోట్లుకు పరిమితం కాగా.. ఈ ఏడాది రూ.1675.77 కోట్లుగా నిలిచింది. ఈ లెక్కన ఈ ఏడాది మేలో గత ఏడాది కంటే జీఎస్టీ వసూళ్లలో రాష్ట్ర వాటా 30.28శాతం వృద్ధి చెందింది. గత ఏడాది మే వరకు జీఎస్టీ వసూళ్ల ప్రగతిశీల స్థూల వసూళ్లు రూ.2966.29 కోట్లకు పరిమితమై, ఈ ఏడాది 36.03శాతం వృద్ధితో రాష్ట్ర ప్రభుత్వం స్థూల వసూళ్లలో వాటా రూ.4034.94 కోట్లకు పెరిగింది.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగిని సత్కరిస్తున్న చైర్మన్ ఈశ్వర పాణిగ్రాహి

జయపురం: కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ పరిధిలో సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని బ్యాంకు చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రహి సత్కరించారు. బ్యాంక్ కార్యదర్శి కృష్ణచంద్ర, అభివృద్ధి పథకాల పరిచాలన అధికారి హరిహర త్రిపాఠి, నవరంగపూర్ శాఖ సహాయకులు పి.మోహనమురళీ వీడ్కోలు సభ స్థానిక పట్టణంలోని ప్రధాన కార్యాలయ సభాగృహంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర సహకార బ్యాంకు ఉన్నతిలో ఉద్యోగుల సేవలు మరువ లేనివని కొనియాడారు. వీరిని ఆదర్శంగా తీసుకొని, మిగతా ఉద్యోగులు ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. బ్యాంకును అన్నివిధాల అభివృద్ధి పరిచి రైతులు, వ్యవసాయదారులకు ఉత్తమ సేవలందించాలన్నారు. అనంతరం ఉద్యోగులకు జ్ఞాపికలు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ డైరెక్టర్ రమాకాంత రౌళొ, న్యాయ సలహాదారు త్రినాథ్‌దాస్, రుణ పరిచాకులు అరుణకుమార్ సాహు, సీనియర్ బ్యాంక్ అధికారి విద్యాధర ప్రధాన్, గొళక బిహారి పాయికరాయ్, అతుల్యకుమార్ మల్లిక్, మనోజ్‌కుమార్ దాస్, కొరాపుట్, రాయగడ సహకార సంస్థల డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో గాలివాన బీభత్సం



ప్రధాన రహదారిలో నేలకొరిగిన భారీ చెట్లు

జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీని ప్రభావంతో వివిధ ప్రాంతాల్లో భారీ చెట్లు నేలకొరిగాయి. ఇళ్లపై రేకులు ఎగిరి పడటంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. సాంబయ్యగూడ, పొత్రొగూడ వీధిలో పలువురికి గాయాలయ్యాయి. మల్కన్‌గిరి–జయపురం ప్రధాన రహదారిపై చెట్లు కూలడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఓడ్రాఫ్ బృందం రంగంలోకి దిగి, వాటిని తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

మల్కన్‌గిరి



పండ్ల దుకాణంపై కూలిన టెంట్లు



చెట్లు పడిపోవడంతో రోడ్డుపై నిలిచిన వాహనాలు

పిస్టల్ తరలిస్తూ ఒడిశా వాసి అరెస్ట్

- పోలీసులు అదుపులో పిస్టల్ విక్రయదారుడు
- మరో ఐదుగురిపై కొనసాగుతున్న విచారణ



నిందితుడిని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు



శ్రీధర్ హరికిషన్ పతాంగి

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు పిస్టల్‌ను తీసుకెళ్తున్న శ్రీధర్ హరికిషన్ పతాంగిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన శ్రీధర్ హరికిషన్ సంపాదన తక్కువగా ఉండటంతో తన బావమరిదిని కలిసి ఏదైనా పని ఉంటే చెప్పమన్నాడు. ఆయన తన స్నేహితుడికి ఈ విషయం చెప్పాడు. వెంటనే ఆయన్ని శ్రీధర్ కలిశాడు. పూరిలోని ఓ వ్యక్తికి పిస్టల్ ఇస్తే రూ.30వేలు ఇస్తామని బేరం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.10 వేలు అందించాడు. పిస్టల్ అందించిన తర్వాత రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. దీంతో శ్రీధర్ పూరీ జగన్నాథస్వామిని దర్శించుకునేందుకు వెళ్దామని ఐదుగురి స్నేహితులను బయలుదేరించాడు. సోమవారం ఉదయం జాలన రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి.. మధ్యాహ్నం మూడు గంటలకు నాందేడ్‌కు చేరుకున్నారు. నాందేడ్ నుంచి నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం ఉదయం విశాఖపట్నానికి వచ్చారు.

పోలీసుల తనిఖీలతో..

శ్రీధర్, అతని స్నేహితులు సాధారణ బోగీలో రావడంతో ఒకరోజు విశాఖలో విశ్రాంతి తీసుకుని, బుధవారం పూరీ వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. రైల్వే న్యూకాలనీలోని ఓ లాడ్జీలో 101, 105 నంబర్లు ఉన్న గదులను బుక్ చేసుకున్నారు. కాగా.. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు రోజువారి విధుల్లో భాగంగా ఎస్ఐలు ఖగేశ్వరరావు, వెంకటరావు మంగళవారం ఈ లాడ్జీని తనిఖీ చేశారు. ఈ క్రమంలో 105 నంబర్ గదిని పరిశీలిస్తుండగా.. ముగ్గురు అనుమానితులుగా కనిపించారు. ఎక్కడకు వెళ్తున్నారని పోలీసులు అడగడంతో తడబడ్డారు. బ్యాగులు తనిఖీ చేయడంతో పిస్టల్ బయటపడింది. మొత్తం ఆరుగురిని ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు తరలించి విచారించడంతో అసలు విషయం బయటపడింది. తన స్నేహితుడు ఒడిశాలోని ఓ వ్యక్తికి పిస్టల్ ఇవ్వాలని చెప్పడంతో బయలుదేరినట్లు శ్రీధర్ పోలీసుల వద్ద ఒప్పుకున్నాడు. మహారాష్ట్రలో శ్రీధర్‌కు పిస్టల్ ఇచ్చిన వారి చిరునామా కనుగొన్న ఎస్ఐ వెంకటరావు బృందం అక్కడకు వెళ్లి మరింత సమాచారం సేకరించింది. పిస్టల్ అమ్మిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొస్తున్నారు. అయితే పిస్టల్‌పై నంబర్ లేకపోవడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

బంగారు తల్లి

● ఖేలో ఇండియా వర్సిటీ క్రీడల్లో పల్లవికి స్వర్ణం



సాధించిన స్వర్ణ పతకం చూపిస్తున్న వెయిట్ లిఫ్టర్ శనపతి పల్లవి

నెల్లిమర్ల రూరల్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో జిల్లాకు చెందిన వెయిట్ లిఫ్టర్ శనపతి పల్లవి ప్రతిభ కనబర్చింది. గత నెల 25 నుంచి జరుగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన పల్లవి స్వర్ణపతకం సాధించింది. 64 కేజీల విభాగంలో గురువారం పోటీల్లో పాల్గొన్న పల్లవి స్నాచ్ 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 108 కిలోల చొప్పున బరువును ఎత్తి ఘనత సాధించింది. స్వర్ణ పతకం సాధించిన పల్లవికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అలరించిన కళాజాతా



నెల్లిమర్లలో ప్రదర్శిస్తున్న బుర్రకథ

నెల్లిమర్ల: పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో గురువారం ప్రదర్శించిన కళాజాతా అందరినీ అలరించింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ కళాజాతాలో బుర్రకథ ద్వారా కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించారు. మొక్కలు విరివిగా నాటాలని.. మొక్కలను పెంచాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మిషన్ లైఫ్‌లో కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలను తొలగిస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

పూసపాటిరేగ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. గురువారం స్థానిక బూడివీధిలో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా రహదారిపై ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఎంపీడీఓ రామారావు వలంటీర్లతో కలిసి తొలగించారు. పాత జాతీయరహదారి నుంచి బూడివీధి కాలనీ రహదారి వరకు చెత్తాచెదారాలను ఏరివేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనుంజయ్, వీఆర్‌ఓ దురగాసి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆయుర్వేదిక్ వైద్యాధికారి శ్రీనివాసరావు

రామభద్రపురం: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న ఆయుర్వేదిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలని ఆయుష్ వైద్యాధికారి ఎస్.శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఆయుష్ ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడిన ఆయన అన్ని రకాల వ్యాధుల నివారణకు సంబంధించి, ఆయుర్వేదిక్ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. సుగర్, వాతనొప్పులు, గ్యాస్టిక్, రక్తహీనత, ఆమవాతం, బీపీ, చర్మ వ్యాధులకు సంబంధించి, మందులు ఉన్నాయన్నా రు. దీర్ఘకాలికంగా ఆయా వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యుల సూచనల మేరకు మందులు పొంది, వాడుకోవాలని తెలిపారు.

ఉద్యోగమేళా రేపు

విజయనగరం రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ సీకర్ లాగిన్‌లో తమ పేర్లు నమోదు చేసుకుని.. బయోడెటా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. విశాఖపట్నంలోని సీనరిజీస్ కాస్టింగ్స్ లిమిటెడ్‌లో 400 ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించే ఉద్యోగ మేళాకు బీఎస్సీ, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసి 19 నుంచి 35 ఏళ్ల లోపున్న నిరుద్యోగులు అర్హులన్నారు.

మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● నాలుగో రోజుకు చేరుకున్న బురదల పోలమ్మ ఉత్సవాలు

రాయగడ: స్థానిక మెయిన్ రోడ్డు వద్ద కొలువై ఉన్న గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన అరిసెలు, మామిడిపండ్లు, నేరేడు, ఈత తదితర సీజన్ పళ్లను తీసుకువచ్చి, ఘటాల్లో వేయడంతో మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. గురువారం ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరగడంతో పాటు దర్శనం కోసం బారులు తీరారు. అదే విధంగా తమ సమస్యలు తీరితే భోగం సమర్పించుకుంటామని మొక్కుకున్న వారు.. ఉత్సవాల్లో అమ్మవారికి భోగాలను సమర్పిస్తారు. ఆదివాసీ వాయిద్యాల నడుమ భక్తులు తమ ఇంటి నుంచి సిద్ధం చేసి భోగాలను తీసుకువచ్చి, ఉత్సవ వేదిక వద్ద సమర్పించుకుంటున్నారు.

నేటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు..

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బార్జి జగన్‌మోహన్‌రావు నాయుడు తెలిపారు. కలహండి జిల్లాకు చెందిన ప్రఖ్యాత కట్టప్ప వేషధారణ బృందం శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమం జరగనుందని వివరించారు.



ఘటాలతో భోగం సమర్పించేందుకు వస్తున్న మహిళలు

సాంకేతిక విద్యకు చేయూత



చిన్నారులతో మాట్లాడుతున్న ఏడీఎం బీరేంద్ర

పర్లాకిమిడి: జిల్లాలో తల్లిదండ్రులను కోల్పోయి, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్లస్2, ఐటీఐ విద్యను అభ్యసించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయం కాన్ఫరెన్స్ మందిరంలో అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్ దాస్ అధ్యక్షతన గురువారం పరామర్శ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ పునరావాస కేంద్రాల నుంచి 40మంది విద్యార్థులు హాజరయ్యారు. పాలిటెక్నిక్ విద్యపై ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులను ప్రభుత్వ ఖర్చులతో చదివించేందుకు అధికారులు ముందుకు వచ్చారు. దీనికై విద్యార్థులు, అధికారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా శిశుసురక్షా యూనిట్ అధికారి(డీసీపీయూ) అరుణ్‌కుమార్ త్రిపాఠి, జిల్లా నియోజన అధికారి సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి, గుమ్మా ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



సంతాన వేణుగోపాల స్వామి కల్యాణాన్ని జరుపుతున్న వేదపండితులు

లక్కవరపుకోట: మండలంలోని కళ్లెంపూడి గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త ఏడువాక శ్రీను ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేముళ్లు, బి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలున్న ప్రాంతాలను గుర్తించండి

● అధికారులకు మంత్రి సవ్యసాచి ఆదేశాలు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నాయక్, పక్కనే జగన్నాథ సరక

రాయగడ: జిల్లాలో తాగునీటి సమస్యతో అల్లాడుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ప్రణాళిక మండలి చైర్మన్ అతున్ సవ్యసాచి సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం రాయగడ చేరుకున్న ఆయన.. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, రాజ్యసభ మాజీ ఎంపి నెక్కంటి భాస్కరరావు, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని కాసీపూర్, చంద్రపూర్, పద్మపూర్ సమితుల్లో తాగునీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వర్షాకాలం రాకముందే సమస్యను పరిష్కరించాలని సూచించారు. మరమ్మతులకు గురైన గొట్టపు బావులు, తాగునీటి వనరులను త్వరితగతిన బాగు చేయించి, శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రణాళిక మండలి ఆధ్వర్యంలో మరోసారి జరిగే సమీక్ష సమావేశానికి ముందు జిల్లాలో తాగునీటి సమస్యను దూరమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా జిల్లాకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మంజూరవుతున్న నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా పడి ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని, లేకుంటే మరో పథకంలో ఆయా నిధులను ఖర్చు చేయాలని సూచించారు. జిల్లాలో తాగునీటి వనరులను సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించుకొవాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పాముకాటుతో మహిళ మృతి



మృతిచెందిన పార్వతి

పార్వతీపురం: మండలంలోని పిన్నింటి రామినాయుడు వలస గ్రామంలో గురువారం పాముకాటుతో మహిళ మృతిచెందింది. ఈ ఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బంకపల్లి పార్వతి(30) బహిర్భూమికి వెళ్లి వస్తుండగా పాము కాటువేయడంతో తక్షణమే స్పందించిన కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మార్గమధ్యంలో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త శ్రీనివాసరావుతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



తీవ్రగాయాలతో పడి ఉన్న హరిహర కుమార్(ఫైల్)

బొండపల్లి: మండలంలోని మరువాడ గ్రామానికి సమీపంలో ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైన బాధితుడు మృతి చెందినట్లు ఎస్సై ఎస్.రవి గురువారం తెలిపారు. గత నెల 28న మండలంలోని రయింద్రాం గ్రామానికి చెందిన హరి హర కుమార్(40) ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదానికి గురి కాగా తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన హరిహరకుమార్‌ను శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన జేసీ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రోణంకి గోవిందరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఒ.ఆనంద్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో గోవిందరావును ప్రభుత్వం నియమించింది. ఆయన పర్యాటక సంస్థ ఎండీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై జేసీగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఉద్యోగులను సమన్వయం చేస్తూ రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష సర్వే పూర్తికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. జేసీకు కలెక్టర్ కార్యాలయం వద్ద డీఆర్వో జె.వెంకటరావు, పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, ఇతర సిబ్బంది స్వాగతం పలికారు.

కలెక్టర్‌ను కలిసిన జేసీ

జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను జేసీ ఆర్.గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. చక్కగా బాధ్యతలను నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

ముందస్తు సమాచారమే ప్రధానం

● ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ వివరాలు తెలియజేయాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ముందస్తు సమాచారం ఇవ్వాలని, దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలందరూ వైద్యసేవలను సద్వినియోగం చేసుకునేందుకు వీలుకలుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. గిరిమిత్ర సమావేశ మందిరంలో హెల్త్ సూపర్‌వైజర్లకు ఆరోగ్య కార్యక్రమాలపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందజేస్తున్న వైద్యసేవలను పోస్టర్ రూపంలో ప్రదర్శించాలన్నారు. గర్భిణుల నమోదు త్వరితగతిన జరగాలని, షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య తనిఖీల కోసం నాలుగుసార్లు పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించడం ద్వారా సరైన ఆరోగ్య పర్యవేక్షణ చేసి మాతా శిశుమరణాలను నివారించవచ్చునన్నారు.

పేదలందరికీ ఇళ్లందించేందుకు

కృషి చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు

● జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు

● 'మో ఘరో' పథకం అమలుపై అధికారులకు శిక్షణ

పర్లాకిమిడి: గ్రామీణ ప్రాంతంలో పేదలు సొంతింటి కల నెరవేర్చేందుకు అంతా కృతనిశ్చయంతో కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు సూచించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ లక్ష్యాన్ని చేరవేయాలని కోరారు. జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ మందిరంలో కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన 'మో ఘరో'(నా ఇల్లు) పథకంపై అధికారులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని పర్లాకిమిడి అర్బన్, ఎన్ఏసీ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి నాలుగు విధాల రుణ సదుపాయంతో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కలిప్తోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులు, దివ్యాంగులకు సబ్సిడీతో రుణాల మంజూరు, రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ, లీగల్ ఫీజులో వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పూరి గుడిసెలు, రేకు ఇళ్లల్లో నివసిస్తున్న వారి వార్షికాదాయం రూ.70 వేలు కంటే తక్కువగా ఉన్నా, నెలకు రూ.25 వేల ఆదాయం కంటే తక్కువగా పొందుతున్న ప్రైవేటు ఉద్యోగులు, 1.5 ఎకరాల కంటే తక్కువ వ్యవసాయం ఉన్న రైతులు అర్హులని ప్రకటించారు. లబ్ధిదారులు జ్జి జ్జి ఇటు://టజొఛీజీటజ్బి.జొరి.జీ౩/ఝొజజ్బిట్బ వెబ్‌సైట్‌లో తన ఇంటి పట్టాను(ఘోరో బారి), స్థలం పట్టా, అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు అందజేసి, ఇళ్లు నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. తద్వారా అనేక మంది ఇళ్లు లేని నిరుపేదలకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. శిబిరంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అలోక్ ప్రధాన్, డీఆర్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి రమాంచల్ ఖమారి, బీడీఓలు, తహసీల్దార్లు, నాబార్డు, ఎస్‌బీఐ, లీడ్‌బ్యాంకు, యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరానికి హాజరైన అధికారులు

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు



రోడ్డుపై గాయాలపాలైన ఆటో ప్రయాణికులు



తేనెటీగల దాడిలో గాయాల పాలై ఆస్పత్రిలో చేరిన జమ్ము రాములు

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిలో లచ్చయ్యపేట వద్ద గురువారం మధ్యాహ్నం ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణం చేస్తున్న ఇద్దరు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న ఆటోలో బి శంకరరావు, కాశీపేటకు చెందిన మైలపిల్లి అప్పమ్మ ప్రయాణం చేస్తున్నారు. లచ్చయ్యపేట గ్రామం దాటిన తరువాత స్పన్ పైపుల కంపెనీకి వచ్చే సమయానికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న గాడీలో ఆటో పడిపోవడంతో ప్రమాదం జరిగింది. రోడ్డుపై పడిన క్షతగాత్రులిద్దరినీ అటుగా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారు గుర్తించి సపర్యలు చేసి 108 కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో పలువురికి..

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామం జగ్గాపు చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులపై తేనె టీగలు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. చెరువులో ఉపాధి పనులు చేస్తూ మట్టి మోస్తున్న సమయంలో సుమారు 15మంది వేతనదారులపై తేనెటీగలు దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితుల్లో జమ్ముురాములు, మజ్జిరాము, మజ్జిబంగారు నాయుడు, మజ్జి సత్యారావు, కె.రాములు గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందుతున్నారు. మరికొంతమంది చిన్నపాటి గాయాలతో ఇళ్ల వద్ద ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు.

భాషా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్న వైస్‌చాన్సలర్ జీఎస్ఎన్ రాజు


నెల్లిమర్ల రూరల్: అధ్యాపకులు భాషా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో సాఫ్ట్‌స్కిల్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మెదడుకు పదును పెడుతూ బోధన పద్ధతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అధ్యాపకులు ఎలాంటి లక్షణాలు కలిగి ఉండాలో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

● గంజాయి, సారా రవాణాపై ఉక్కుపాదం మోపాలి

● కోర్టు కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలి

● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్



కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ

పార్వతీపురంటౌన్: పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, సారా రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీలు విధిగా నిర్వహించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కోర్టుల్లో ట్రయల్‌కు వచ్చిన కేసులను స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకుంటూ ఉండాలని సూచించారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరవుతున్నారా? లేదా? వారిని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా? అన్న సమాచారాన్ని కోర్టు కానిస్టేబుల్ ద్వారా తెలుసుకుని సాక్షులు నిర్భయంగా వాస్తవాన్ని న్యాయమూర్తి ఎదుట ధైర్యంగా చెప్పేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు

తమ తమ పోలీసు స్టేషన్ల పరిధిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. రాత్రిపూట గస్తీ తిరుగుతూ విధులు నిర్వహిస్తున్న పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ జె.చిరంజీవి హోం గార్డు, ఎం. శంకరరావు, మక్కువ పోలీసుస్టేషన్‌కు సంబంధించిచోరీ కేసులో సొత్తు రికవరీ చేసి, నిందితుడిని పట్టుకున్నందుకు గాను కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ ఎస్‌డీపీఓ కృష్ణారావు, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ నాగేశ్వరరావు, ఎస్బీ సీఐ శ్రీనివాసరావు, జిల్లా సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో మహాస్వామిజీ



స్వామిజీకి ప్రసాదాన్ని అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లిసూర్యనారాయణ స్వామి వారిని విజయవాడకు చెందిన భువనేశ్వరి పీఠాధిపతి శ్రీకమలానంద భారతి మహాస్వామిజీ తన శిష్యగణంతో కలిసి గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికి అంతరాలయ దర్శనాన్ని చేయించారు. ఆదిత్యునికి స్వామిజీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనివెట్టి మండపంలో కమలానంద భారతి కాసేపు అనుగ్రహభాషణం చేశారు. ఆలయంలో అద్భుతంగా అర్చనావిధానం జరుగుతోందన్నారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

శ్రీముఖలింగంలో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పంచరాత్రి కల్యాణ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన గురువారం జేష్ఠమాసం సందర్భంగా ఔపాసన, హోమం, బలిహారణ, హారతి మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు చేశారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం చేశారు.

నవోదయ దరఖాస్తుల సవరణకు అవకాశం



మాట్లాడుతున్న పరశురామయ్య

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఏమైన పొరపాట్లు ఉంటే శుక్రవారంలోగా సవరణ చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు మేల్, ఫిమేల్, కులం, ఏరియా, వికలాంగత్వం తదితర వివరాలు మాత్రమే సవరణ చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష కోసం విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు.

డీటీసీగా శివరాం ప్రసాద్ నియామకం



శివరాం ప్రసాద్

శ్రీకాకుళం రూరల్: డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా (డీటీసీ) శివరాం ప్రసాద్ నియామకమయ్యారు. ఈయన ప్రస్తుతం అనంతపురం జిల్లా డీటీసీగా పనిచేస్తున్నారు. త్వరలో ఈయన బాధ్యతలు తీసుకోనున్నారు. కాగా ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన శ్రీదేవి పదోన్నతిపై విశాఖకు బదిలీపై వెళ్లారు.

మైనర్‌పై అత్యాచార యత్నం!

ఇచ్ఛాపురం: మైనర్ బాలికపై 55 ఏళ్ల వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడినట్టు ఫిర్యాదు అందిందని ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. పట్టణంలోని గొల్లవీధికి చెందిన మైనర్‌పై పి.జగన్నాయకులు ఘోరానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. బాలిక తల్లి గురువారం చేసిన ఫిర్యాదు మేరకు నిందితుడ్ని అదుపులోకి తీసుకొని అతనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



త్రినాథరావుకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ఉద్యోగ విరమణ తరువాత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పని చేసి గురువారం ఉద్యోగ విరమణ చేసిన కె.త్రినాథరావును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, తక్షణ సాయంగా రూ. 5 వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో త్రినాథరావు నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ బి.ప్రదీప్ పాల్గొన్నారు.

మోగిన కాలేజీ గంట..

- పునఃప్రారంభమైన జూనియర్ కళాశాలలు
- తొలిరోజు అంతంత మాత్రమే హాజరు



తరగతులకు హాజరైన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ కోర్సులను అందిస్తున్న జూనియర్ కళాశాలలు వేసవి సెలవుల అనంతరం గురువారం పునఃప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయిలో తెరుచుకోవడంతోపాటు క్లాసులు కూడా మొదలయ్యాయి. అయితే తొలిరోజు అంతంత మాత్రంగానే విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశిత షెడ్యూల్‌ను విడుదల చేసింది.

నాలుగేళ్ల తర్వాత..

కరోనా వైరస్ (కోవిడ్)తో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ ప్రభుత్వ పకడ్బందీ చర్యలతో ఎట్టకేలకు పూర్తిస్థాయిలో గాడినపడ్డట్టయింది. వాస్తవానికి కరోనా విజృంభనకు ముందు ఏడాది వరకు ఏటా జూన్ ఒకటో తేదీన జూనియర్ కళాశాలలు తెరుచుకునేవి. కోవిడ్‌కు ముందు 2019 జూన్ ఒకటో తేదీన కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. 2020 మార్చిలో విజృంభించిన కోవిడ్ కారణంగా 2020లో ఆగస్టు నెలలో, 2021లో నవంబర్‌లో, 2022 జూలై మాసాల్లో కళాశాలలు అనేక ఆంక్షలు, నిబంధనల నడుమ తెరుచుకున్నాయి. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం మాస్కులు ధరించి, శానిటైజర్లతో చేతులు శుభ్రపరుచుకుని అనేక ఆంక్షలు నడుమ తరగతులు నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంది. ఈ ఏడాది 2023లో జూన్ ఒకటో తేదీన కళాశాలలు మళ్లీ పాత విధానంలో తెరచుకున్నాయి.

బోధనకు ఆటంకం లేకుండా..

సర్కారీ కళాశాలల్లో తరగతుల నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. జూన్ ఒకటి నుంచి కాంట్రాక్ట్ ఫ్యాకల్టీతో పాటు గెస్ట్‌ఫ్యాకల్టీని కూడా పనిచేసేలా రెన్యువల్ ఉత్తర్వులు వెలువరించింది. 375 కాంట్రాక్ట్, 90 మంది గెస్ట్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. జిల్లాలో మొత్తం 168 జూనియర్ కళాశాలలు ఉండగా.. ఇందులో 38 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో అక్కడక్కడా మిగిలి ఉన్న ఖాళీలను గతంలో పనిచేసినవారితోపాటు అర్హులైన గెస్ట్ ఫ్యాకల్టీతో భర్తీ చేయనున్నారు.

227 రోజులు పనిదినాలు..

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ కోర్సులను అందిస్తున్న జూనియర్ కళాశాలలు 227 రోజులు పనిచేయనున్నాయి. 2024 మార్చి 28 ఆఖరి పనిదినం. 2024 మార్చి 29 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు. 2024 ఫిబ్రవరి రెండో వారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారం నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియెట్ బోర్డు వార్షిక క్యాలెండర్ ప్రకారం జూన్ ఒకటి నుంచి మార్చి 28వ తేదీ వరకు మొత్తం 302 రోజులు ఉండగా ఇందులో 227 రోజులు కళాశాలలు పనిచేయనున్నాయి. మరో 75 రోజులు రెండవ శనివారం, ఆదివారం, ఇతర సెలవు దినాలు. అలాగే జూలై 26 నుంచి 28 వరకు మొదటి యూనిట్, ఆగస్టు 24 నుంచి 26 వరకు రెండో, అక్టోబర్ 16 నుంచి 18 వరకు మూడో, నవంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు నాలుగో యూనిట్ పరీక్షలు జరుగుతాయి. అలాగే త్రైమాసిక (క్వార్టర్లీ) పరీక్షలు సెప్టెంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు, అర్ధ సంవత్సర పరీక్షలు డిసెంబర్ 18 నుంచి 23 వరకు, ప్రీఫైనల్ పరీక్షలు 2024 జనవరి 18 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు సోమవారం తెరుచుకున్నాయి. తరగతులు కూడా మొదలవుతాయి. సెలవులు ముగిశాయి కాబట్టి విద్యార్థులు కళాశాలలకు హాజరవ్వాలి. తరగతులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో పాఠాలు బోధించడంతోపాటు అన్ని వసతులు, సౌకర్యాలతో విద్యను అందించేలా చర్యలు తీసుకున్నాం.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి(డీఐఈవో), శ్రీకాకుళం

జిల్లాలోని మేనేజ్‌మెంట్లవారీగా జూనియర్ కళాశాలలు

మేనేజ్‌మెంట్/కేటగిరీ	సంఖ్య
ప్రభుత్వ కళాశాలలు	38
మోడల్ జూనియర్ కళాశాలలు	13
సోషల్ వెల్ఫేర్	09
ట్రైబల్ వెల్ఫేర్	01
కేజీబీవీ జూనియర్ కళాశాలలు	17
కోపరేటివ్ కళాశాలలు	02
ఒకేషనల్ కళాశాలలు	01
ప్రైవేట్, అన్-ఎయిడెడ్ కళాశాలలు	87
మొత్తం	168

బార్ అసోసియేషన్ సమావేశం



మాట్లాడుతున్న సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాత క్యాంటీన్ బకాయిలు, క్యాంటీన్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం, జనరేటర్‌కు మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్టు సూర్యారావు తెలిపారు. ఈ నెల 20వ తేదీన మరోసారి సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చిస్తామన్నారు. అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి ధరావత్తుల లెక్కలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి పి.రాము, ఉపాధ్యక్షుడు జి.చంద్రమౌళి, స్పోర్ట్సు సెక్రటరీ గుంగు భాస్కరరావు, మహిళా ప్రతినిధి హరిప్రియ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు కొంక్యాన సుభాష్, ఎ.కృష్ణరాజు, కె.అఫీసునాయుడు, మామిడి క్రాంతి, కూన రాజారావు, పొన్నాడ వెంకటరమణారావు, బీసీ న్యాయవాదులు సంఘం ప్రతినిధులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, కూన అన్నంనాయుడు పాల్గొన్నారు.

● 'పర్యావరణ' పోటీలకు విశేష స్పందన



ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం' అనే అంశంపై శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో 8, 9, 1ంవ తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం శ్రీకాకుళం ఈఈ ఎస్.శంకర్‌నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రవేటు స్కూల్స్ నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 5న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కరుణశ్రీ, హరీష్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పకడ్బందీగా గ్రూప్‌-1 పరీక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఈ నెల 3 నుంచి 10 వరకు గ్రూప్ - 1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్‌- 1 పరీక్షలకు సంబంధించి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డీఆర్‌ఓ అధ్యక్షతన గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జూన్ 3 నుంచి 10 వరకు (4వ తేదీ మినహా) జరిగే పరీక్షలకు 353 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షల నిర్వహణలో సమస్యలు తలెత్తితే ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.ప్రమీల (9014550846), సెక్షన్ ఆఫీసర్ లెం.అమ్మాజీ (9014550882) ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ తిప్పేస్వామి, పరీక్షల లైజన్ ఆఫీసర్ జి.గ్రేస్, చీఫ్ సూపరింటెండెంట్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జంపు కృష్ణమోహన్, ఆర్టీసీ, విద్యుత్ పాల్గొన్నారు.

సొంతగూటికి 34 మంది పోలీసు సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో 34 మంది పోలీసు సిబ్బందికి అటాచ్‌మెంట్లు రద్దు చేస్తూ.. తిరిగి తమ మాతృ పోలీస్‌స్టేషన్లకే పోస్టింగ్‌లు ఇచ్చినట్లు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కార్యాలయం నుంచి బుధవారం అర్ధరాత్రి మోమో జారీ చేశారు. ఇందులో ఏడుగురు ఏఎస్‌ఐలు, 16 మంది పీసీలు, 11మంది హెచ్‌సీలు ఉన్నారు. మరో పదిమందికి (వ్యక్తిగత బదిలీల్లో భాగంగా ఇద్దరు పీసీలు, ఒక హెచ్‌సీ) బదిలీలు జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ స్పాట్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) గురువారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ (బాలుర) జూనియర్ కళాశాల కేంద్రంగా మూడు విడతల్లో భాగంగా గురువారం మొదటి స్పెల్ మూల్యాంకనం మొదలైంది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, బోటనీ, సివిక్స్ పేపర్ల దిద్దుబాటు ప్రక్రియ జరుగుతోంది. మూల్యాంకనానికి హాజరైన సీఈలు, ఎస్‌ఈలు, ఏఈలకు అధికారులు పలు సూచనలు చేశారు.

బ్రాండెడ్ ఉపకరణాలతో విద్యుత్ ఆదా



మాట్లాడుతున్న దైవప్రసాద్

అరసవల్లి: భవనాలను నిర్మిస్తున్న బిల్డర్లు తప్పనిసరిగా బ్రాండెడ్ పరికరాలను మాత్రమే వినియోగించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్ సూచించారు. నాణ్యమైన విద్యుత్ పరికరాల వినియోగంతో కరెంటు ఆదా అవుతోందన్నారు. నీతిఆయోగ్ సూచనల మేరకు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ నిర్వహించిన ఇంధన పరిరక్షణ అంశంపై స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న యజమానులు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు ఇంధన పొదుపు విషయంపై సీరియస్‌గా వ్యవహరించాలని..లేదంటే భావితరాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతానికి డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ..గ్రామీణ ప్రాంతాల్లో సైతం అధికంగా ఏసీల వినియోగంతో విద్యుత్ డిమాండ్ పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్డర్లతో పాటు ప్రతివారు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించుకోవాలన్నారు. విద్యుత్ ప్రొటక్షన్ విభాగ ఏడీఈ పైడి యోగేశ్వరరావు మాట్లాడుతూ.. తప్పనిసరిగా ఎల్‌ఈడీ లైట్లు, టీవీలు వినియోగించాలని సూచించారు. ఉపయోగంలో లేని విద్యుత్ ఉపకరణాలను స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. అనంతరం నీతిఆయోగ్ ప్రతిపాదించిన పలు అంశాలను ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బిల్డర్లుకు, విద్యుత్ శాఖ సిబ్బందికి వివరించారు. టెక్నికల్ ఈఈ ఎల్‌సీహెచ్ పాత్రుడు, జేఏవోలు ససపల వెంకటరావు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పక్కాగా క్లాస్ వర్కు

ఎచ్చెర్ల క్యాంపస్: క్లాస్ వర్కు పక్కాగా జరగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ గురువారం పునఃప్రారంభమైన నేపథ్యంలో ఆర్ట్సు, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు, బోధకులు, బోధనేతర సిబ్బంది హాజరు, రిజిస్టర్లను పరిశీలించారు. హాజరు మెరుగ్గా ఉండాలని, అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్ వర్కు పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. హాజరులో ఎవరికీ ఎటువంటి మినహాయింపు ఉండదన్నారు. సమయ పాలన తప్పనిసరని స్పష్టం చేశా రు. ఆయన వెంట రిజస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత బొడ్డేపల్లి

- మాజీ డిప్యూటీ సీఎం కృష్ణదాస్
- నుసరాంలో రాజగోపాలరావు విగ్రహావిష్కరణ



రాజగోపాలరావు విగ్రహావిష్కరణలో కృష్ణదాస్, నాయకులు

పోలాకి: నిస్వార్థ రాజకీయ నాయకుడు, ప్రజాసేవకుడు దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు అందరికీ స్ఫూర్తి ప్రదాత అని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నుసరాం గ్రామంలో పార్లమెంటు మాజీ సభ్యుడు రాజగోపాలరావు విగ్రహావిష్కరణ, అదే వేదికపై నరసన్నపేట వ్యవసాయమార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కృష్ణదాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొడ్డేపల్లి కుటుంబంతో తమకు ఆత్మీయసంబంధాలు కలిగి ఉన్నాయని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో బొడ్డేపల్లి సత్యవతితో కలసి ఎమ్మెల్యేగా పనిచేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. జిల్లాకు రాజగోపాల్ చేసిన చిరస్మరణీయమన్నారు. గొప్పవ్యక్తిత్వం కలిగిన నేత విగ్రహావిష్కరణ తన చేతులమీదుగా జరగడం గొప్పజ్ఞాపకంగా గుర్తుచేసుకోవటంతోపాటు అదృష్టంగా భావిస్తానని చెప్పారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ.. కళింగ జాతి ఆణిముత్యం వంటి నాయకుడు బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాలు చేయాలనుకుంటున్న తమ అభిప్రాయం తెలియజేయగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించిన తీరు ఎన్నటికీ మర్చిపోలేమని చెప్పారు. ప్రత్యేక జీవో ద్వారా నిధులు విడుదల చేసి దివంగత ఎంపీ విగ్రహాల ఏర్పాటుతోపాటు, ఘనంగా శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి కృతజ్ఞతలు తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ.. నేటి మాతరం రాజకీయ నాయకులకు రాజగోపాలరావు వంటి నాయకులు రోల్‌మోడల్ అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు వేళయింది. ఈ నెల 2 నుంచి మొదలుకానున్న పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 10129 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతాయి.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 8.45 నుంచి పరీక్ష కేంద్రాల లోపలకు అనుమతించనున్నారు. 9.30 తర్వాత అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకానుంది. పోలీసుల పహారా కాయనున్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటించారు. కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఏ ఒక్కరి వద్దా మొబైల్‌ఫోన్లు ఉండటానికి వీల్లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పోలీసులు, మెడికల్ సిబ్బంది సైతం పరీక్ష కేంద్రం బయటే ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేధం.

మౌలిక సదుపాయాలపై దృష్టి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 శాతం నేలరాతలు లేకుండా పక్కాగా ఫర్నీచర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. మండే ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు, తాగునీరు కల్పనకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. 14 కేంద్రాలకు సీఎస్‌లు, డీవోలను నియమించారు. తనిఖీల కోసం విద్యాశాఖ, రెవిన్యూశాఖ, పోలీసుశాఖల పర్యవేక్షణలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. 5 రూట్లను గుర్తించి 15 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. పరీక్షల ఏర్పాట్లు విషయమై డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నేతృత్వంలో అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, డివైఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు.

ఆ జైలు కంటే నరకం నయం

- నాన్న చనిపోయిన విషయం కూడా తెలియలేదు
- పాకిస్థాన్ జైల్లో నరకయాతన అనుభవించా
- పాక్ చెర నుంచి విడుదలైన మత్స్యకారుడు భాస్కరరావు ఉద్వేగం



ఎచ్చెర్ల క్యాంపస్: పాకిస్థాన్ జైలు నుంచి విడుదలై ఇంటికి తిరిగి వస్తానని అనుకోలేదని ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ జాలారు కొయ్యాంకు చెందిన మత్స్యకారుడు మైలపల్లి భాస్కరరావు ఉద్వేగంతో చెప్పారు. 2018 నవంబర్ 18న గుజరాత్ రాష్ట్రం వీరావల్‌లో చేపల వేట సాగిస్తూ పొరపాటున పాక్ జలాల్లో ప్రవేశించిన భాస్కరరావును అక్కడి కోస్టుగార్డులు పట్టుకుని కరాచీ జైలులో పడేశారు. ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో ఐదేళ్ల తర్వాత పాక్ జైలు నుంచి విడుదలైన భాస్కరరావు గత నెల 13న గుజరాత్ చేరుకున్నారు. వైద్య సేవలు అందుకొని పూర్తిగా కోలుకున్నాక గురువారం స్వగ్రామానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను, గ్రామస్తులను చూసి ఆనందంతో ఉద్వేగానికి గురయ్యారు. భాస్కరరావు తల్లి భూదేవి గతంలోనే మృతి చెందింది. తండ్రి కృష్ణమూర్తి 2021లో మృతి చెందాడు. ఈ విషయం భాస్కరరావుకు తెలియదు. ఈ నెల 13న గుజరాత్ చేరుకున్నాక గ్రామస్తులతో ఫోన్‌లో మాట్లాడుతుండగా విషయం తెలిసింది.

జైల్లో నరకం..

కరాచీ జైల్లో వాళ్లు పెట్టిందే తినాలని, ఎటువంటి బయట సమాచారం తెలియనివ్వరని భాస్కరరావు తెలిపారు. ఉర్దూ రాకపోవడం, సరైన ఆహా రం లేకపోవడంతో నరకయాతన అనుభవించినట్లు గుర్తు చేసుకున్నా రు. ఇంటికి తిరిగి వస్తానని, తన వారిని చూస్తానని అస్సలు అనుకోలేదని చెప్పారు. ఇప్పుడు అందరినీ చూశాక పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈయన అవివాహితుడు. ఇద్దరు సోదరులు గ్రామంలోనే ఉన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

గ్రామానికి చేరుకున్న భాస్కరరావును మత్స్యకార నాయకులు గురువారం పరామర్శించారు. నిత్యావసర సరుకులు, స్వీట్లు అందజేశారు. పాక్ చెర నుంచి తనను విడిపించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీ మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మెన్ కోలా గురువులు, నాయకులు కొమర శంకరరావు, కోనాడ నర్సింగరావు, సర్పంచ్ తాతారావు, మూగి శ్రీరాములు, మూగి గురుమూర్తి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పెద్దబొడ్డపాడులో ముగిసిన ఉత్సవాలు



అగ్నిగుండం తొక్కుతున్న అమ్మవారి దాసుడు మోహనరావు

వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడు గ్రామంలోని కాళీమాత ఉత్సవాలు గురువారం ముగిశాయి. అగ్నిగుండం ప్రవేశంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. అమ్మవారి దాసుడు తమ్మినాన మోహనరావు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అగ్నిగుండం ప్రవేశం చేశారు. అమ్మవారి ఉత్సవాలంటే చాలా చోట్ల సిరిమానుపై పూజారి అధిరోహించి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. కాని ఉద్దానం పల్లెల్లో కొన్ని చోట్ల అగ్నిగుండం ప్రవేశం జరుగుతుంది. దాదాపు 150 మీటర్ల పొడవుతో ఉన్న అగ్నిగుండంలోని నిప్పులపై మూడు సార్లు నడవడంతో భక్తులు పరవశించిపోయారు. దీన్ని తిలకించేందుకు సూదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇంటి పైకప్పుల పైకి ఎక్కి తిలకించారు. అనంతరం అమ్మవారి దాసుడు పురవీధుల్లో దాసుడు ఇంటింటా తిరిగి దీవెనలు అందించారు. ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పాడ ఆనందరావు, ఉప సర్పంచ్ దుంపల గోవిందరావు, నెహ్రూ యువజన సంఘం ప్రతినిధులు టి.శ్రీకాంత్, పి.సీతారాం, దుంపల వల్లభరావు , దేవాదాస్ ధన్యవాదాలు తెలిపారు.



అగ్నిగుండ ప్రవేశాన్ని ఇళ్లపైకెక్కి తిలకిస్తున్న భక్తులు